క్లుప్తంగా

తాగునీటి సమస్య తీర్చాలని వినతి



జిల్లా కలెక్టర్ జి.సృజనకు తాగునీటి కష్టాలను వివరిస్తున్న కందనాతి మహిళలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కందనాతి గ్రామంలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యను తీర్చాలని గ్రామ మహిళలు జిల్లా కలెక్టర్ జి.సృజనను కోరారు. శుక్రవారం గ్రామానికి వచ్చిన జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ గోడు విన్నవించారు. వేసవిలో బిందె నీటి కోసం నానా అవస్థలు పడుతున్నామని వివరించారు. స్పందించిన కలెక్టర్ తాగునీటి సమస్యపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్.నాగలాపురం వద్ద ఉన్న ఎస్ఎస్ ట్యాంక్ నుంచి 6 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోందని, అయితే ట్యాంక్‌లో మోటార్లు పాడైపోవడంతో నీటి సమస్య ఏర్పడిందని వారు బదులిచ్చారు. త్వరలో నీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని, అలాగే రోడ్డు సమస్య కూడా పరిష్కరిస్తానని కలెక్టర్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ముస్లింల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ముస్లింలు విన్నవించారు. వలంటీర్లు తమకు సరైన సమాచారం ఇవ్వటం లేదని కొందరు ఫిర్యాదు చేశారు. సమస్యపై అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు.

ఓటీఎస్ ద్వారా విత్తనాల పంపిణీ

హాలహర్వి: ఖరీఫ్ సీజన్‌లో శేరుశనగ పంటను సాగుచేసే రైతులకు ఓటీఎస్ ద్వారా విత్తనాలు పంపిణీ చేస్తామని ఏఓ శివశంకర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలానికి 180 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయించాలని అధికారులను కోరామన్నారు. ఇప్పటికే కొన్ని క్వింటాళ్లు మంజూరయ్యాయని, అలాగే 190 క్వింటాళ్ల కందులు మంజూరైనట్లు చెప్పారు. కదిరి లేపాక్షి రకం విత్తనాన్ని రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఏఓ శివశంకర్ తెలిపారు.

ఇద్దరు ఉద్యోగులకు గాయాలు

చిప్పగిరి: బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో కిందపడి ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మధుస్వామి, మండలంలోని డేగులహాలు గ్రామంలో వీర్వోగా విధులు నిర్వహిస్తున్న చంద్రనాయక్ విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం ఉదయం కర్నూలు కలెక్టర్ కార్యాలయానికి బైక్‌పై బయలు దేరారు. పెద్దటేకూరు వద్ద వెళుతుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ కింద పడి గాయాల పాలయ్యారు. గమనించిన వాహనదారులు వారిని కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇద్దరూ సురక్షితంగా ఉన్నట్లు తహసీల్దారు లక్ష్మినారాయణ తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

గోనెగండ్ల: మండలంలోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ అధికారి రాజా కిషోర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పంటలు సాగు చేయడానికి రైతులు సిద్ధపడుతున్నారన్నారు. బావులు, బోర్లు ఉన్న రైతులు ఇప్పటికే మిరప, ఉల్లి, పత్తి తదితర పంటలను సాగుచేసుకున్నారు. రైతులు కూడా విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాలు దారులు అనుమతి ఉన్న మందులను మాత్రమే విక్రయించాలన్నారు.

స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

ఆలూరు రూరల్: పట్టణంలోని 4వ వార్డులో ఉన్న మారెమ్మ దేవాలయ స్థలం ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మహానంది డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి గ్రామ పంచాయతీ ఈఓ కృష్ణ కుమార్‌కు వినతి పత్రం అందించారు. సర్వే నంబర్ 56లో ఉన్న మారెమ్మ దేవాలయ స్థలంలో స్థానికులు అక్రమంగా కట్టడాలు చేపడుతున్నారన్నారు. అలాగే ఆలయం ఆవరణంలో ఎడ్ల బండ్లు నిలుపుతుండడంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందిగా మారిందని చెప్పారు. సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుని ఆక్రమణకు గురైన ఆలయ స్థలాన్ని ఖాళీ చేయించాలని కోరారు.

కౌలు రైతులను గుర్తించండి

వెల్దుర్తి: గ్రామాలలో అర్హులైన కౌలు రైతులను గుర్తించి, వారికి కౌలు హక్కు కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలని ఏఓ అక్బర్‌బాష ఆర్బీకే సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన బుక్కాపురం, కలుగొట్ల, పుల్లగుమ్మి, రామళ్లకోట ఆర్బీకేలను సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడం వల్ల రైతు భరోసా, ఉచిత పంటల బీమా, క్రాప్‌లోన్స్, సున్నా వడ్డీ, కనీస మద్దతు ధర తదితర పథకాలు వర్తిస్తాయని, వీటిపై ఆర్బీకే సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు.

అందుబాటులో ఆధార్ సేవలు

- ప్రభుత్వ ఆధార్ కేంద్రాలతో అవినీతికి చెక్
- నామమాత్రపు ఫీజులతో సేవలు
- విద్యార్థుల కోసం పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు



ఆధార్ కేంద్రంలో వివరాలు నమోదు చేస్తున్న అధికారి

మద్దికెర: గతంలో ఆధార్ కేంద్రాలు ప్రైవేట్ వ్యక్తులతో నిర్వహించడంతో మార్పులు, చేర్పులు చేసి అనర్హులు కూడా సంక్షేమ పథకాలు పొందేందుకు అవకాశాలు ఎక్కువగా ఉండేవి. కొందరు ఆధార్ కేంద్రాల నిర్వాహకులు అవినీతికి పాల్పడడంతో అధికారులు దాడులు నిర్వహించి వాటిని రద్దు చేశారు. ప్రజలు ఆధార్ నమోదు కోసం ఇబ్బందులు పడకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి మండల కేంద్రంలోని ఒక సచివాలయంలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు తీరడంతో పాటు అవినీతికి చెక్ పడింది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మండలానికో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి నామమాత్రపు ఫీజులతో ఆధార్‌లో మార్పులు చేర్పులు వంటి సేవందిస్తున్నారు. గతంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో మార్పులు, చేర్పులు చేసుకోడానికి దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇబ్బందులు పడేవారు. అంతేగాక వ్యవప్రయాసలు పడలేక వాయిదా వేసుకుంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సకాలంలో పొందలేకపోయేవారు. ప్రస్తుతం మండల కేంద్రాల్లోని సచివాలయాల్లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసి వాటిలో దాదాపు 740 సేవలను నామమాత్రపు ఫీజులకే అందించేందుకు చర్యలు చేపట్టారు. దీనివల్ల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఉన్నచోటే పనులు చక్కబెట్టుకోవచ్చు.

విద్యార్థుల కోసం ప్రత్యేక శిబిరాలు

రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకానికి ఆధార్ తప్పనిసరి కావడంతో పాఠశాలల విద్యార్థులు ఆధార్ కేంద్రం చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోకుండా పాఠశాలల్లోనే ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఆధార్ నమోదు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాస తప్పింది



మా పిల్లలు ఇద్దరు ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ కాకపోవడంతో ప్రభుత్వ పథకాలు, నా భార్యకు పొదుపు రుణాలు మంజూరు కాక ఇబ్బందులు పడ్డాను. రోజుల తరబడి తిరిగినా పనికాలేదు. మండల కేంద్రంలోని సచివాయలంలో ఆధార్ శిబిరం ఏర్పాటు చేయడం వల్ల అక్కడికి వెళ్లిన గంటల వ్యవధిలోనే పని అయిపోయింది. దీంతో వ్యయ ప్రయాసలు తప్పాయి. – రమేష్, మద్దికెర

త్వరగా పనిఅయిపోయింది



మా అబ్బాయికి ఆధార్ కార్డులో వివరాలు మార్పులు చేసుకోవాలని పాఠశాలలో చెప్పడంతో రోజుల తరబడి తిరిగినా పని అయ్యేది కాదు. కానీ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేసిన తరువాత కొద్ది సమయంలోనే పని పూర్తి కావడంతో బాధలు తప్పాయి. – తిరుమలయ్య, ఎం.అగ్రహారం

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం ప్రజలకు సత్వర సేవలు అందించడంతోపాటు అవినీతికి తావు లేకుండా సచివాలయాలలో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. రోజుల తరబడి తిరగకుండా మండల కేంద్రంలోనే నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఆధార్ సవలకు సంబంధిత ధ్రువపత్రాలు ఆన్‌లైన్‌లో నమోదుచేసిన తరువాతే వివరాలు అప్‌డేట్ అవుతాయి. – నాగరాజు, తహసీల్దార్, మద్దికెర

లోతైన దుక్కులు దున్నుకోవాలి

ఆలూరు: ఖరీఫ్ సీజన్‌లో పత్తి, మిరప, జొన్న, కంది పంటలను సాగుచేసే ఎర్ర నేలల రైతులు తొలకరి వర్షాలకు ఏటవాలుగాను, లోతైన దుక్కులు దున్నుకోవాలని ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్ రైతులకు ఏడీఏ సునీత సూచనలు చేశారు. ఆమె శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రైతులు నేల సారం పెంచేలా పచ్చిరొట్ట ఎరువులు వాడాలని, పిల్లి పెసర, జీలుగ విత్తనాలు జల్లి పొలంలో కలియదున్నడం వల్ల ప్రయోజనం ఉంటుందన్నారు. లోతైన దుక్కుల వల్ల వర్షపు నీరు నేలలో ఇంకి సారవంతంగా మారుతుందని, విత్తుకు బెట్టను తట్టుకునే శక్తి లభిస్తుందని చెప్పారు. భూసార పరీక్షలు చేయించుకున్న రైతులు నేల స్వభావాన్ని బట్టి ఎలాంటి పోషకాలు వాడాలో తెలియజేశారు.

సబ్సిడీ విత్తనాల కోసం నమోదు చేసుకోండి

చిప్పగిరి: ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ ఆనంద్ సూచించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలానికి 80 టన్నుల వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. మార్కెట్‌లో వేరుశనగ విత్తనం ధర క్వింటం రూ.9,300 ఉండగా ప్రభుత్వం రూ.3,720 సబ్సిడీపై అందిస్తోందని, రైతులు క్వింటాలుకు రూ.5,580 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్ బుక్, ఆధార్ కార్డ్ జిరాక్స్ తీసుకొని సమీప ఆర్బీకేలో సంప్రదించాలని సూచించారు.

సంక్షేమ వారధులు వలంటీర్లు



పగిడిరాయిలో వలంటీర్లను సన్మానిస్తున్న జగన్నాథరెడ్డి



సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎంపీడీఓ గౌరీదేవి తదితరులు

తుగ్గలి: ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా ఉంటూ వలంటీర్లు వెలకట్టలేని సేవలందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథరెడ్డి అన్నారు. శుక్రవారం పగిడిరాయిలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ సేవలందించిన వలంటీర్లను శాలువా కప్పి సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించారు. బ్యాడ్జి, ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకాలు అందించారు. పంచాయతీ కార్యదర్శి గోపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు బసిరెడ్డి, హనుమంతు, లాలిరెడ్డి, శేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచులు మల్లికార్జున, విజయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి, ఎం.అగ్రహారం, బురుజుల గ్రామాల్లో సచివాలయ వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, వైస్ ఎంపీపీ మహేష్‌రెడ్డి ఈఓలు సుధాకర్, సంజప్ప, వైస్ సర్పంచ్ ఆముదాల గోపాల్, వైస్సార్సీపీ నాయకులు రేవప్ప తదితరులు పాల్గొన్నారు.

దేవనకొండ: వలంటీర్లు ప్రజాసేవకు అంకితమై బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ గౌరీదేవి సూచించారు. దేవనకొండ మండలం తెర్నెకల్ గ్రామ సర్పంచ్ అరుణకుమార్ ఆధ్వర్యంలో గ్రామంలో వలంటీర్లకు సేవా పురస్కారాలను శుక్రవారం అందజేశారు. తెర్నెకల్‌కు చెందిన కరిష్మాకు సేవా రత్న అవార్డు అందజేసి సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

పత్తికొండ రూరల్: ఈనెల 30వ తేదీన పత్తికొండలో జరగబోయే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మండలాధ్యక్షురాలు ఎస్.నాగరత్నమ్మ, కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నివాస గృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సీఎం పత్తికొండకు రావడం ఆనందదాయకమన్నారు. జగనన్నకు పెద్ద ఎత్తున స్వాగతం పలుకుదామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర్, పల్లెప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామానికి చెందిన బోయ లక్ష్మిదేవి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఫిర్యాది కుమారుడు తమ కుమార్తెను తీసుకెళ్లిపోయాడనే కోపంతో ఇదే గ్రామానికి చెందిన చిన్నరామప్ప, రాజేశ్వరి, అనిల్, గోనెగండ్ల మండలం కున్నూరుకు చెందిన మరో ఇద్దరు దాడి చేసి గాయపరచినట్లు చెప్పారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలియజేశారు.

2 నుంచి క్రికెట్ టోర్నీ

హొళగుంద: ఇంగళదహాల్ గ్రామంలో జూన్ 2 నుంచి కేసీ తిమ్మారెడ్డి (కేసీటీఆర్) మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, హసేన్, తిమ్మప్ప, వీరేశ్, యంకప్ప, కిట్టీ, అజిత్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. దివంగత కేసీ తిమ్మారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో టోర్నీ నిర్వహించి విజేతలకు రూ.50 వేలు, రన్నర్స్‌కు రూ.25 వేల నగదు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు రూ.2 వేలు ఎంట్రీ ఫీజు చెల్లించి జట్టు పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 78935 87255, 84999 47028 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

దళితులకు న్యాయం చేయాలి

హొళగుంద: లింగంపల్లి గ్రామంలో 20 ఏళ్ల క్రితం దళితులకు పంపిణీ చేసిన ల్యాండ్ సీలింగ్ భూముల్లో అక్రమాలకు పాల్పడిన అప్పటి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకొని బాధితులు న్యాయం చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై శుక్రవారం దళిత సంఘాల నాయకులు రాజు, మనోజ్, గుడుదప్ప, బాధిత రైతులు స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దారు హుసేన్‌సాహెబ్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

పశు ఆస్పత్రి స్థలం ఆక్రమణ

నందవరం: మండల పరిధిలోని టి.సోమలగూడూరు గ్రామంలో టీడీపీ నాయకుడు నాయిని లక్ష్మన్న పశు వైద్యశాలకు చెందిన స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామ కంఠం భూమి సర్వే నంబర్ 168లో 4 సెంట్ల స్థలాన్ని 2008–2009లో సర్పంచ్‌గా పని చేసిన ఉషమ్మ పశువుల ఆసుపత్రికి కేటాయిస్తూ తీర్మానం చేశారు. బేస్‌మట్టం లెవల్ వరకు నిర్మాణం కూడా జరిగింది. అయితే నిధులు లేక పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం టీడీపీ నాయకుడు నాయిని లక్ష్మన్న స్థలం ఆక్రమించుకుని మట్టిని వేసి చదును చేయించుకున్నాడు. ఆ స్థలం తనదని పట్టా ఉందని బెదిరింపులకు దిగుతున్నాడు. ఈ విషయంపై పశు వైద్యాధికారి నరేంద్రనాథ్ రెడ్డిని వివరణ కోరగా.. ఆ స్థలం గతంలో పశు వైద్యశాలకు కేటాయించారని, తహసీల్దార్ నిత్యానందరాజును వివరణగా ఆ స్థలంపై ఏవరికీ పట్టా మంజూరు చేయలేదని తెలిపారన్నారు. ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ మహేష్‌కుమార్‌కు అర్జీ సమర్పించినట్లు వెల్లడించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మద్దికెర: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా సమానంగా చేస్తున్నారని, అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం మద్దికెరలోని రాంనగర్‌లో రూ.55 లక్షలు ఎంపీ ల్యాడ్స్‌తో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కాలనీ ఏర్పడి 35 ఏళ్లవుతున్నా ఇంతవరకు సీసీ రోడ్లు వేయకపోవడం బాధాకరమన్నారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్లు నిర్మించామన్నారు. అనంతరం రాంనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ అనిత, ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, సర్పంచులు సుహాసిని, మల్లికార్జున, సలహాదారు బండారు ఆంజనేయులు, ఎంపీటీసీలు ఆంజనేయులు, రామకృష్ణ, ఎంపీడీఓ నరసింహమూర్తి, డీఈ శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

సీఎం సభను జయప్రదం చేయండి

తుగ్గలి: ఈనెల 30న పత్తికొండలో నిర్వహించనున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేసేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. గురువారం తుగ్గలిలో ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగనన్న ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసి ఈనెల 30వతేదీ నాటికి నాలుగేళ్లు పూర్తవుతుందన్నారు. అంతటి ప్రత్యేకమైన రోజున రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమానికి సీఎం వైఎస్ జగనన్న పత్తికొండను ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. సీఎం పర్యటనను అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చే యాలని సూచించారు. పార్టీ నాయకులు విజయలక్ష్మి, జగన్నాథరెడ్డి, రామచంద్రారెడ్డి, నాగేష్, పులికొండనాయక్, తుగ్గలి మోహన్‌రెడ్డి, హనుమంతు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆలూరు రూరల్: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఆలూరుఎంపీడీఓ అల్లబకాష్ వెల్లడించారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ మంగమ్మ అధ్యక్షతన సమావేశం ఉంటుందని, జెడ్పీటీసీ ఏరూరు శేఖర్ అన్ని గ్రామాల సర్పంచు లు, ఎంపీటీసీలు హాజరవుతారన్నారు. గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం, జగనన్న స్వచ్ఛ సంకల్పం, ఆరోగ్య, వ్యవసాయ, విద్యా శాఖలపై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని సూచించారు.

హొళగుందలో..

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 31న నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల శనివారానికి (27వ తేదీ)కి మార్చినట్లు ఎంపీడీఓ దాసానాయక్ తెలిపారు. ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

ముమ్మరంగా సిటిజన్ సర్వే

ఆస్పరి: ఆస్పరిలో శుక్రవారం వలంటీర్లు, సచివాలయం సిబ్బంది సిటిజన్ సర్వే చేపట్టినట్లు ఈఓ రామాంజినేయులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కుటుంబాన్ని వలంటీర్లు, సచివాలయం సిబ్బంది సర్వే చేస్తారన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులు అందుబాటులో ఉన్నారా? లేదా? పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని పరిశీలించడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వీర్రాజు

తుగ్గలి: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వీర్రాజును నియమిస్తూ జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇంతవరకు అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎస్ఎం బాషా ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్నారు. ఆయన స్థానంలో ఇక్కడే పనిచేస్తున్న ఈఓపీఆర్డీ వీర్రాజుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ఎం బాషా తెలిపారు.

స్పిన్నింగ్ మిల్లుకు విద్యుత్ శాఖ నోటీసులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వెంకటాపురం కాలనీ వద్ద ఉన్న స్పిన్నింగ్ మిల్లు హెచ్‌టీ విద్యుత్ వాడకానికి సంబంధించి రూ.4,00,62,805 బకాయి ఉండటంతో వసూలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రూ.4 కోట్లకు పైగా బకాయి ఉండటంతో మిల్లుకు సంబంధించిన స్థలాలపై ఎవరూ లావాదేవీలు చేయరాదంటూ శుక్రవారం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాఘవేంద్రరావు, రెవెన్యూ రికవరీ డీటీ ఎస్‌టీ అహమ్మద్, ఏఈ సుబ్బారెడ్డి నోటీసును స్పిన్నింగ్ మిల్లు గోడపై అతికించారు.

రైల్వే విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

వెల్దుర్తి: స్థానిక రైల్వే విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా ప్రారంభమైంది. శుక్రవారం మండల పరిధిలోని మల్లెపల్లె (శెట్టిపల్లె) 220కేవీ ఇరిగేషన్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి స్థానిక రైల్వే విద్యుత్ సబ్‌స్టేషన్‌కు గ్రిడ్ అండ్ మేనేజ్‌మెంట్ డెరెక్టర్ భాస్కర్, కడప డివిజన్ చీఫ్ ఇంజినీర్ మోహన్ కుమార్ పూజాది కార్యక్రమాలు నిర్వహించి, ఛార్జ్ చేసి విద్యుత్ సరఫరా ప్రారంభించారు. అనంతరం డైరెక్టర్ భాస్కర్ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరా, అభివృద్ధి పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించారు. కర్నూలు కన్‌స్ట్రక్షన్ ఎస్ఈ రామకృష్ణ, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఎస్ఈ కృష్ణకుమార్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఉమాపతితో కలిసి జరుగుతున్న అభివృద్ధి పనులు, వేసవిలో విద్యుత్ సరఫరా తీరు, డిమాండ్‌పై సమీక్షించారు. సరఫరాలో ఎలాంటి లోటుపాట్లకు అవకాశమివ్వరాదని ఆదేశించారు. విద్యుత్ అధికారులు మాట్లాడుతూ మల్లెపల్లె నుంచి ప్రారంభించిన ఛార్జ్ ద్వారా వెల్దుర్తి 220 కేవీ రైల్వే విద్యుత్ సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా తద్వారా రైల్వే ఎలక్ట్రికల్ లైన్‌కు విద్యుత్ అందుతుందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వేసవిలో డిమాండ్‌కు తగ్గ సరఫరా అందిస్తూనే, వివిధ శాఖల అవసరాలకు తగ్గ విద్యుత్ సరఫరా, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌కో, కన్‌స్ట్రక్షన్, ఆపరేషన్స్ శాఖల డీఈలు, ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ కడప సీఈ, కర్నూలు అధికారులతో మాట్లాడుతున్న గ్రిడ్ అండ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ భాస్కర్ (టోపీ పెట్టుకున్న వ్యక్తి)

పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు

గోనెగండ్ల: ఆటోలలో, బొలెరో వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. లారీలు, ట్రాక్టర్లు, తదితర వాహనాలలో అధిక లోడుతో వెళ్లరాదన్నారు. అట్టి వాహనాలను సీజ్ చేసి ఆర్‌టీఓకు అప్పగిస్తామన్నారు. వాహనదారులు వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు, లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వలంటీర్లకు పురస్కారాలు

నందవరం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో వలంటీర్లు మరింత బాధ్యతగా పని చేయాలని సర్పంచ్ పావని, ఎంపీటీసీ మాధవి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి, టి.సోమలగూడూరు, పోనకలదిన్నె, పూలచింత గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు జ్యోతి, నాసన్న, శ్రీధర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ, వెఎస్సార్‌సీపీ నాయకులు వలంటీర్లకు సేవ మిత్ర పురస్కారాలను అందజేశారు. శాలువా, షీల్డ్, ప్రశంసా పత్రాలతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ వలంటీర్ల సేవలను కొనియడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రఘు, నాగరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సోమలగూడూరులో సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో అధికారులు

సమస్యలను పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వార్డుల్లో ప్రజలకు ఏ సమస్య వచ్చినా సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శానిటరీ, వార్డు సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని 3వ వార్డుతో పాటు పలు వార్డుల్లో ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులతో పాటు ఇటీవల కుక్కకాటుకు గాయపడ్డ బాలుడిని పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వార్డుల్లోని రోడ్లు, డ్రైన్లలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మేస్త్రీలు, వార్డు సచివాలయ సెక్రటరీలు ఉన్నారు.



పట్టణంలోని 3వ వార్డులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్

అవగాహనతోనే అధిక దిగుబడులు

ఎమ్మిగనూరు: పంట యాజమాన్య పద్ధతులపై రైతులు దృష్టి సారించాలని, అవగాహనతోనే అధిక దిగుబడులు సాధ్యమని ఏడీఏ మహ్మద్ ఖాద్రి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని పెస్టిసైడ్ షాపులను ఆయన తనిఖీ చేశారు. విక్రయదారులకు హెచ్చరికలు జారీ చేస్తూ రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేకపోతే రైతుల సాగుకష్టం బూడిదపాలు కాక తప్పదన్నారు.



పురుగు మందులను పరిశీలిస్తున్న ఏడీఏ ఖాద్రి

విత్తనాల ఎంపిక: వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్సులు పొందిన అధీకృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోళ్లు చేయాలని, బిల్లుల్లో విత్తన రకం, నంబర్, గడువు తేదీ, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం ఉండేలా చూసుకోవాలని సూచించారు. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరచిన డబ్బాల్లో ఉన్న విత్తనాలు, గడువు తేదీ ముగిసిన విత్తనాలు కొనుగోలు చేయరాదన్నారు. ముఖ్యంగా కంపెనీ సీలు, డీలర్ సంతకం లేకుండా తీసుకోరాదన్నారు.

ఎరువులు: అధీకృత డీలర్ల వద్ద మిషన్ కుట్టు ఉన్న ఎరువుల బస్తాలు, చేతికుట్టు ఉంటే దానిపై సీసం సీలు ఉండేలా చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, విక్రయదారుడి పేరు ఉండాలి. ఎరువుల్లో అన్య పదార్థాలు కనిపిస్తే కల్తీ ఎరువుగా గుర్తించి వ్యవసాయ శాఖకు ఫిర్యాదు చేయాలి.

పురుగు మందుల ఎంపిక: వ్యవసాయ, ఉద్యాన శాఖ శాస్త్రవేత్తలు సూచించిన మందులనే వాడాలి. ఎక్కువ కాలం నిల్వచేసిన మందులను కొనరాదు. పురుగు మందుల డబ్బాలపై వజ్రాకారంలో రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలం రంగులో, స్వల్ప మోతాదు అయితే ఆకుపచ్చ రంగులో ఉంటాయి. రెండు, మూడు రకాలను కలిపి ఒకేసారి వాడరాదు. ప్రతి గ్రామంలో రైతు భరోసా కేంద్రాల్లో ఉండే వ్యవసాయ సహాయకులు, విస్తరణాధికారుల సేవలను రైతులు వినియోగించుకోవాలి.